

పలహార బండి ఊరేగింపులో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

## ఘనంగా ఫలహార బండి ఊరేగింపు

**రాయదుర్గం, జూలై 30(ఆంధ్రజ్యోతి):** గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లి, ఎన్టీఆర్ నగర్‌లో బోనాల ఉత్సవాల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వేణుగోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఫలహారబండి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు చేసి ఫలహారబండి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్ యాదవ్, సత్యనారాయణ, సురేశ్‌నాయక్, శ్రీనివాస్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ట్రాఫిక్ సమస్యను వెంటనే పరిష్కరించాలి

**హైదర్‌నగర్, జూలై 30(ఆంధ్రజ్యోతి):** వివేకానందనగర్ డివిజన్ వివేకానందనగర్, సప్తగిరి కాలనీ భాష్యం స్కూల్ వద్ద నెలకొన్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన చర్యలపై ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్యతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే అరెపూడి గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రచించాలన్నారు. దీనికి కాలనీవాసులు కూడా సహకారించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ముత్తుయాదవ్, ఎస్ఐ రమేశ్, గోపాల్, నాయకులు చంద్రకాంత్‌రావు, శర్మ, ఎల్లం నాయుడు, వినోద్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

**హైదర్‌నగర్, జూలై 30(ఆంధ్రజ్యోతి):** ఆల్విన్‌కాలనీ డివిజన్ విజయనగర్ కాలనీలో పూర్తయిన సీసీరోడ్ల పనులను మంగళవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. ఏ సమస్యలున్నా ప్రజలు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో స్థానికులు శివరాజ్‌గౌడ్, ఫారూఖ్, కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ మోహన్, జనరల్ సెక్రటరీ లింగారెడ్డి, ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్

## డయల్ డీఆర్ఎం, డీఎంకు విశేష స్పందన

### ఫిర్యాదులను పరిశీలిస్తామన్న ఆర్టీసీ అధికారులు

**ఫతేనగర్, జూలై 30(ఆంధ్రజ్యోతి):** కూకట్‌పల్లి ఆర్టీసీ డిపో డీఎం, డీఆర్ఎం మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం, డీఆర్ఎం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు ఇద్దరు అధికారులు ఫోన్‌లో అందుబాటులో ఉండడంతో ప్రయాణికులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. డీఆర్ఎం ఆర్. కవితకు మియాపూర్, శంకర్‌పల్లి, పటాన్‌చెరువు, లింగంపల్లి ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఫోన్ చేసి సమస్యలను వివరించారు. పటాన్‌చెరు, లింగంపల్లి నుంచి కోకాపేటకు బస్సులు నడపాలని ఎక్కువ మంది కోరినట్లు ఆమె తెలిపారు. లింగంపల్లి నుంచి వయా మియాపూర్ మీదుగా కొంపల్లి వరకు బస్సులు నడపాలని, మియాపూర్ నుంచి గండిమైసమ్మ వరకు నడిచే బస్సులను బహదూర్‌పల్లి వరకు పొడిగించాలని పలువురు డీఆర్ఎంను కోరారు. అదే విధంగా కూకట్‌పల్లి డీఎంకు ఫోన్ చేసిన వారిలో ఎక్కువ మంది జగద్గిరిగుట్ట నుంచి కోఠికి బస్సులు నడపాలని కోరినట్లు డిపో మేనేజర్ డి.హరి తెలిపారు. ప్రయాణికుల సమస్యలను పరిశీలించి ఉన్నతాధికారులతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని డీఆర్ఎం కవిత, డీఎం హరి తెలిపారు.

## ఘనంగా తలుపులమ్మ, వేలమణి దుర్గమ్మ బోనాలు

**హైదర్‌నగర్, జూలై 30(ఆంధ్రజ్యోతి):** కూకట్‌పల్లి నియోజకవర్గంలో బోనాల ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం కూకట్‌పల్లి డివిజన్ ఏబీటీపురంలో ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు వాసు ఆధ్వర్యంలో తలపులమ్మ తల్లి, పాతపట్నం వేలమణి దుర్గమ్మ బోనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేశ్, సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మేకల రమేశ్, చందర్‌రావు, ప్రవీణ్‌కుమార్, రంగస్వామి, అప్పారావు, కిరణ్, పాపారావు, జీవరత్నం, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.



బోనాల కార్యక్రమంలో కాంగ్రెస్ నేత బండి రమేశ్



ఫతేనగర్ డివిజన్ భరత్‌నగర్ కాలనీ పోచమ్మ ఆలయంలో మంగళవారం జరిగిన బోనాలు, పలహారపు బండి ఊరేగింపు కార్యక్రమాల్లో ఏసీపీ హన్మంత్‌రావు, సనత్‌నగర్ సీఐ శ్రీవాసులు, ఎస్ఐ కృష్ణ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి ఫతేనగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి):

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

**పేట్‌బషీరాబాద్, జూలై 30(ఆంధ్రజ్యోతి):** కళ్లు కనపడటం లేదనే మనస్తాపంతో ఓ వ్యక్తి చెరువులోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పేట్‌బషీరాబాద్ అడ్మిన్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలో నివాసం ఉంటున్న బాలరాజు(43) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల కళ్లు సరిగా కనిపించకపోవడంతో ఏ పని చేయలేకపోతున్నాననే మనస్తాపానికి గురైన బాలరాజు మంగళవారం ఉదయం గుండ్లపోచంపల్లి చెరువులో దూకాడు. గమనించిన స్థానికులు చెరువులోకి దూకి కాపాడే ప్రయత్నం చేసినా అప్పటికే బాలరాజు మృతి చెందాడు. ఈ మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

## గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్టు

**కేపీహెచ్‌బీకాలనీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** మూసాపేట్ మెట్రో స్టేషన్ పక్కన పాడుపడ్డ భవనంలో మంగళవారం గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారు లింగారెడ్డి, తన్నీరు మహేందర్, కొమ్ము రాకేశ్‌లుగా గుర్తించి వారి నుంచి 100 గ్రాములు చొప్పున ఉండే 12 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు.



పోలీసుల అదుపులోని యువకులు

# మృత్యుకుహారాలుగా క్వారీ గుంతలు

- గాజులరామారం డివిజన్‌లో ప్రమాదకరంగా గుంతలు
- బాలయ్య బస్తీ క్వారీ గుంతలో 20 మందికి పైగా మృతి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు
- ఆందోళనలో స్థానిక ప్రజలు



ప్రమాదకరంగా క్వారీ గుంత

**గాజులరామారం, జూలై 30(ఆంధ్రజ్యోతి):** గాజులరామారం డివిజన్‌లోని క్వారీ గుంతలు మృత్యుకుహారాలుగా మారాయి. ఎన్నో ప్రాణాలు గాలిలో కలుస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులకు కనువిప్పు కలుగడం లేదు. సంఘటనలు జరిగినప్పుడే అక్కడికి వచ్చి హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారు. కానీ, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టడడం లేదు. గాజులరామారం డివిజన్‌లోని దేవేందర్‌నగర్, కైసర్‌నగర్, ప్రగతినగర్, బాలయ్య బస్తీల్లో ఉన్న క్వారీగుంతలు ప్రమాదకరంగా మారాయి. బాలయ్య బస్తీలోని క్వారీ గుంతలో పడి సుమారు 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. గుంతల్లో పడిన వారిని బయటకు తీయడానికి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు రావాల్సి వస్తుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

### ఈత సరదా కోసం వెళ్లి..

ఇటీవల బాలయ్య బస్తీలో గృహ ప్రవేశానికి వచ్చిన ఓ మహిళ బట్టలు ఉతకడానికని ఆ క్వారీ గుంతలోకి వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందింది. అలాగే భార్యతో గొడవ పడి మనస్తాపానికి గురైన భర్త సమీపంలో ఉన్న క్వారీ గుంతలో దూకి ప్రాణాలు తీసుకున్నాడు. కాగా, సోమవారం కైసర్‌నగర్‌కి చెందిన సల్మాన్ కుమారుడు సోయల్ స్నేహితులతో కలిసి ఈత సరదా కోసం వెళ్లి ప్రాణాలు విడిచాడు. ఇలా దేవేందర్‌నగర్ చుట్టు పక్కల క్వారీల్లో అనేక మంది ప్రాణాలు విడిచినట్లు స్థానికులు తెలుపుతున్నారు. గతంలో అధికారులు ఆయా క్వారీ గుంతల్లో ప్రమాదాలు జరగకుండా చుట్టూ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కానీ ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో అదే పరంపర కొనసాగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### లోతుగా ఉండడం వల్లే ప్రమాదాలు



బాలయ్య బస్తీలో ఉన్న క్వారీలు లోతుగా ఉన్నాయి. అందుకే అందులో పడిన వ్యక్తులు మరణిస్తున్నారు. వేరే ప్రాంతాలు నుంచి వచ్చి సరదాగా ఈత కోసమని వెళ్లి ప్రాణాలు విడుస్తున్నారు.

- చిన్నా, బాలయ్యబస్తీ వాసి

### కంచెను ఏర్పాటు చేయాలి



మహిళలు చిన్న పిల్లలు క్వారీ గుంతలో బట్టలు ఉతికేందుకు వెళ్లి అందులో పడిపోతున్నారు. అందులో పడిన వ్యక్తులను బయటకు తీయడం కూడా కష్టంగా మారింది. అధికారులు స్పందించి ఆ గుంతల చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలి.

-డి.రాజు, బాలయ్యబస్తీ వాసి

# స్ట్రీట్‌లైట్స్ నిర్వహణ సక్రమంగా ఉండాలి

### అవసరమైన చోట వెంటనే మరమ్మతులు చేపట్టాలి

### ఎలక్ట్రిల్ ఇంజనీరింగ్ అధికారులతో జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి




జోన్ అధికారులతో మాట్లాడుతున్న జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి

**గచ్చిబౌలి, జూలై 30(ఆంధ్రజ్యోతి):** శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో వీధి దీపాల నిర్వహణపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని పగడ్బందీగా నిర్వహణ చేపట్టాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం జోనల్ కార్యాలయంలో సర్కిల్ ఎలక్ట్రిల్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో స్ట్రీట్ లైట్స్ నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. వెలగని దీపాలకు వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ప్రాంతాలవారీగా సమస్యలను విభజించి స్థానిక అధికారులకు సమాచారం చేరవేయాలన్నారు. ట్విట్టర్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రిల్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

### రోడ్డు ఆక్రమణలను అరికట్టాలి

రోడ్లను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే వెంటనే కూల్చివేయాలని జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జాతీయ, అంతర్గ రోడ్లపై ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్లలో మంగళవారం ఆయన సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. పీజేఆర్ ఎన్‌క్లేవ్, అపర్ణ కాలనీ రోడ్లను, లింగంపల్లి మార్కెట్‌ను పరిశీలించారు. అనంతరం బొటానికల్ గార్డెన్ వద్ద పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రహదారులపై ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన దుకాణాలు, చిరు వ్యాపారులను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జీహెచ్ఎంటీ టౌన్‌ప్లానింగ్, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చోట డివైడర్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తుల గణనకు జీఐఎస్ సర్వే షురూ

**చందానగర్, జూలై 30(ఆంధ్రజ్యోతి):** స్మార్ట్ హైదరాబాద్ నిర్మాణానికి( డిజిటలైజేషన్) గ్రేటర్ పరిధిలో జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం(జీఐఎస్) ద్వారా ఆస్తుల గణన సర్వే మంగళవారం ప్రారంభమైంది. చందానగర్ సర్కిల్‌లో కార్పొరేటర్ మంజుల ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సర్వే పూర్తైన తర్వాత హైదరాబాద్‌లోని ఒకొక్క భవనానికి ప్రత్యేక నంబర్ కేటాయిస్తారు. దాని ద్వారా ఆ భవన సమాచారం పూర్తిగా ఉంటుంది. అలాగే భవనానికి సంబంధించిన అనుమతులు మొదలుకుని అన్ని పత్రాలను డిజిటలైజ్ చేయనున్నారు. ఈ సర్వేను ఓ ప్రైవేటు ఏజెన్సీ జీహెచ్ఎంసీ సంయుక్తంగా నిర్వహిస్తోంది. చందానగర్, మియాపూర్ డివిజన్‌లో ఈ సర్వే నిర్వహించారు. భవన యజమానికి సంబంధించిన పత్రాలను వారు పరిశీలిస్తారు. ఏజెన్సీ సభ్యులతో పాటు చందానగర్ సూపరింటెండెంట్‌లు వినయ్, కృష్ణ ఈ సర్వేలో పాల్గొన్నారు. ఈ సర్వే కోసం బిల్డింగ్ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్, ఆస్తిపన్ను సంఖ్య, నీటిబిల్లు, విద్యుత్ బిల్లు, యజమాని ఆధార్ కార్డు, వ్యాపార సముదాయం అయితే ట్రేడ్ లైసెన్స్, పన్ను రశీదు ఉండాలి.



సర్వేను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మంజుల

### కేపీహెచ్‌బీలో 25 ఇళ్లలో..

**కేపీహెచ్‌బీకాలనీ:** మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో మంగళవారం జీఐఎస్ సర్వేను ప్రారంభించారు. కేపీహెచ్‌బీ, హైదర్‌నగర్ వార్డుల పరిధిలో వీవోలు, బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి నియోజియో సంస్థ ప్రతినిధులు ఇంటింటికీ తిరిగి సర్వే చేశారు. ఆయా ప్రాంతాల్లోని వారికి ముందస్తు సమాచారం లేకపోవడం వివరాలు పూర్తిగా నమోదు చేయలేకోయారు. కేపీహెచ్‌బీలో 25కు 8, హైదర్‌నగర్‌లో 30 భవనాలకు వెళ్లగా కేవలం 12 ఇళ్ల డేటాను మాత్రమే ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు.

### పాట్‌హోల్స్‌ను పూడ్చిన అధికారులు



గుంతలను పూడ్చుతున్న సిబ్బంది

**హైదరాబాద్ సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** వర్షాలకు ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లపై ఏర్పడిన పాట్‌హోల్స్(గుంతలు)ను పూడ్చేందుకు జీహెచ్ఎంసీ చర్యలు ప్రారంభించింది. మంగళవారం వర్షం రాకపోవడంతో కమిషనర్ ఆదేశాల మేరకు జోనల్, సర్కిల్ స్థాయి ఇంజనీరింగ్ అధికారులు జీహెచ్ఎంసీకి చెందిన ప్లాంట్ల నుంచి బీటీ మిక్సింగ్(బీటీసీ)తో పాట్‌హోల్స్ పూడ్చారు. చుడిబజార్, చందానగర్ సర్కిల్ దీప్తి శ్రీనగర్ ప్రాంతాల్లో గుంతలు పూడ్చడంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో సిమెంట్‌తో పూడ్చారు.

# రిజిస్ట్రార్ పర్మిషన్.. ప్రిన్సిపాల్ క్యాన్సిలేషన్

### జేఎన్‌టీయూలో ఉన్నతాధికారుల మధ్య కోల్డ్‌వార్

### వీసీ జోక్యానికి అధికారుల విజ్ఞప్తి

**హైదరాబాద్ సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** జేఎన్‌టీయూలో రిజిస్ట్రార్‌కు, ఉన్నతాధికారులకు మధ్య కోల్డ్‌వార్ నడుస్తోందా.. అంటే అవుననే అంటున్నారు పలువురు ఉద్యోగులు. తమ విభాగాల నుంచి ముఖ్యమైన ఫైళ్లు రిజిస్ట్రార్‌కు పంపినా, వాటిని క్లియర్ చేయకుండా తన వద్దనే అట్టిపెట్టుకుంటున్నారని కొందరు డైరెక్టర్లు రిజిస్ట్రార్ తీరును ఆక్షేపిస్తున్నారు. ఇదిలా ఉంటే.. గతవారం నిబంధనలకు విరుద్ధంగా ఒక కాంట్రాక్టు పద్ధతిలో నియమితుడైన సహాయ ఆచార్యుడిని అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) నిర్వహించే శిక్షణా కార్యక్రమానికి పంపేందుకు రిజిస్ట్రార్ పర్మిషన్ ఇవ్వడం తాజాగా వివాదాస్పదమైంది. వాస్తవానికి ఈ శిక్షణా కార్యక్రమానికి రెగ్యులర్ ఫ్యాకల్టీని పంపాలని ఏఐసీటీఈ నిబంధనల్లో స్పష్టంగా ఉన్నా కాంట్రాక్టు ఫ్యాకల్టీకి అనుమతిస్తూ 22న రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇది నిబంధనలకు విరుద్ధంగా ఉన్నందున రద్దు చేస్తున్నట్లుగా వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ 26న ఉత్తర్వులు జారీచేశారు. అనుమతి రద్దు చేసిన అంశాన్ని సదరు కాంట్రాక్టు ఫ్యాకల్టీకి తెలియజేసినప్పటికీ, ప్రిన్సిపాల్ ఆదేశాలను కాదని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఏఐసీటీఈ శిక్షణకు వెళ్లడం.. రెగ్యులర్ ప్రొఫెసర్లను, వర్సిటీ సిబ్బందిని ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రిన్సిపాల్ ఆదేశాలను ధిక్కరించిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని రెగ్యులర్ ఆచార్యులు డిమాండ్ చేస్తున్నారు. రిజిస్ట్రార్‌కు, ఉన్నతాధికారులకు మధ్య ఏర్పడిన అంతరాన్ని తొలగించేందుకు వీసీ చర్యలు తీసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



జేఎన్‌టీయూ పరిపాలనా భవనం

### నూతన అగ్రిమెంట్ పత్రాలకు సర్క్యులర్

యూనివర్సిటీలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఈ విద్యాసంవత్సరంలో నూతన అగ్రిమెంట్ పత్రాలను సమర్పించాలని ఇటీవల ప్రిన్సిపాల్ సర్క్యులర్ జారీ చేశారు. జూలై 1 నుంచి వచ్చే ఏడాది జూన్ 29 వరకు తాము విధులు నిర్వహించేందుకు సుముఖత వ్యక్తం చేస్తూ రూ.100 విలువైన నాన్-జుడీషియల్ స్టాంప్ పేపరుపై నిర్ణీత ఫార్మాట్‌లో సంతకం చేసి పంపాలని ఆ సర్క్యులర్‌లో పేర్కొన్నారు. అయితే.. ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న మొత్తం 90మంది కాంట్రాక్ట్ ఫ్యాకల్టీలో కేవలం ఆరుగురు మాత్రమే గడువులోగా అగ్రిమెంట్ పత్రాలు సమర్పించినట్లు తెలిసింది. గడువు ముగియడంతో అగ్రిమెంట్ పత్రాలు సమర్పించని కాంట్రాక్టు ఆచార్యులను తొలగిస్తారా లేదా కొనసాగిస్తారా అనే తేలాల్సి ఉంది. ఈ క్రమంలో సదరు ఫ్యాకల్టీకి జూలై నెల వేతనాల చెల్లింపులోనూ సందిగ్ధత నెలకొంది.

## విధుల్లో ఏకాగ్రతతో పని చేయాలి



ఆర్టీసీ ఉద్యోగులతో ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్

**పేట్‌బషీరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** విధుల్లో ఏకాగ్రతతో పని చేసినప్పుడే మంచి ఫలితాలు వస్తాయని జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ అన్నారు. జీడిమెట్ల బస్సు డిపోలో ప్రమాదరహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆయనతో పాటు డిపో మేనేజర్ ఆంజనేయులు, అసిస్టెంట్ మేనేజర్ నీలాణి, అసిస్టెంట్ ఇంజనీర్ సందీప్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవర్లు విధుల్లో ఉన్నప్పుడు వారి వ్యక్తిగత సమస్యల గురించి ఆలోచించకూడదని సూచించారు. ముఖ్యంగా స్టీరింగ్ చేతిలో ఉన్నప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడవద్దన్నారు. డిపోలో ఆటల పోటీలు నిర్వహించారు. అందులో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు బహుమతులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో బస్సు డ్రైవర్లు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచితంగా మెదడు వాపు నివారణ టీకాలు

**అల్లాపూర్, 30 జూలై (ఆంధ్రజ్యోతి):** మెదడు వాపు (జాపనీస్ ఎన్‌సెఫలైటిస్) వ్యాధి నివారణకు ఉపకరించే వ్యాక్సిన్‌ను పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో (యూపీహెచ్‌సీలలో) ఉచితంగా అందజేస్తున్నట్లు పర్వత్‌నగర్ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షాలినిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. తొమ్మిది నెలల శిశువుల నుంచి 15 ఏళ్ల పిల్లలందరికీ ఈ వ్యాక్సిన్ ద్వారా మెదడు వాపు వ్యాధిని నివారించవచ్చన్నారు. మొదట జీరో డోసు టీకా వేయించుకున్న నెల రోజుల వ్యవధిలో బూస్టర్ టీకా తీసుకోవాలని సూచించారు. ఆగస్టు 1 నుంచి 15వ తేదీ వరకు ఈ టీకాలను ఉచితంగా అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు 86391 62793 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.



డాక్టర్ షాలిని

## పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా : కృష్ణాయాదవ్

**దుండిగల్, జూలై 30(ఆంధ్రజ్యోతి):** ప్రధాన మంత్రి పోషణ్ కార్యక్రమంలో భాగంగా దుండిగల్‌కు చెందిన జక్కుల ఐశ్వర్య జ్ఞాపకార్థం దుండిగల్‌లోని ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ జక్కుల కృష్ణాయాదవ్ హాజరయ్యారు. విద్యార్థులకు అరటి, యాపిల్ పండ్లును పంపిణీ చేశారు. ఇక నుంచి విద్యార్థులకు, పాఠశాల అభివృద్ధికి తోచిన విధంగా సహాయ సహకారాలందిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆనంద్‌కుమార్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ముత్యంగౌడ్, నాయకులు టి.వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, బాలరాజు యాదవ్, నర్సింగ్ గౌడ్, అరుణ్‌గౌడ్, శివుడు, రాజుగౌడ్, పిట్ల రమేష్, భాను గౌడ్, తలారి రాజు, నాగరాజు ఉన్నారు.



విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న కృష్ణయాదవ్

## టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ



మొక్కను నాటుతున్న నిర్మాణ్ సంస్థ మేనేజర్ ఆదర్శ్

**దుండిగల్, జూలై 30(ఆంధ్రజ్యోతి):** దారిద్ర్య రేఖకు దిగువనున్న లబ్ధిదారులకు టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ప్లేస్‌మెంట్ అందిస్తున్నట్లు నిర్మాణ్ సంస్థ మేనేజర్ ఆదర్శ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలాగే లబ్ధిదారులకు మంచి ప్లేస్‌మెంట్ కోర్సులను నిర్మాణ్, మైండ్‌స్పేస్ అందిస్తుందన్నారు. ఇప్పటికే 60 మంది లబ్ధిదారులకు ఈ ఉచిత శిక్షణలో చేరారని, వారికి ప్లేస్‌మెంట్లను కల్పిస్తామన్నారు. అనంతరం దుండిగల్, గండిమైసమ్మ మండలంలోని బహదూర్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తిరుపతయ్య, ఎస్కెఎంపీఎం ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ మెహమూన్, మంజునాథ్, బీమ్‌రావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజే ధ్యేయం

**మియాపూర్, జూలై 30(ఆంధ్రజ్యోతి):** జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజే ధ్యేయమని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ అన్నారు. మంగళవారం శేరిలింగంపల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నూతన రాష్ట్ర కమిటీకి ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీని, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి వెంకట్‌రెడ్డి, కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎండి సలీమ్ పాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై పోరాటానికి టీయూడబ్ల్యూజే ఎప్పుడూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్‌బాబా, ప్రధాన కార్యదర్శి వై.అశోక్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, శంకర్, బాలరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



విరాహత్ అలీని సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

## పరిసరాల పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి

**కేపీహెచ్‌బీకాలనీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని యూసీడీ పీవో ఇంద్రసేన అన్నారు. సీవో మురళి ఆధ్వర్యంలో మంగళవారం మూసాపేట్‌లో ఇంటింటికీ తిరుగుతూ దోమల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమకాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు, బోదవ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌పీలు శ్రావణి, ఊర్మిల తదితరులు పాల్గొన్నారు.




దోమల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## నీటి సరఫరాకు అంతరాయం కలగవద్దు

**హైదర్‌నగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి):** మంజీర పైపలైను లీకేజీ మరమ్మతులు పూర్తి చేసి నీటి సరఫరాకి అంతరాయం లేకుండా చూడాలని కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. హైదర్‌నగర్ డివిజన్ ఆదిత్యనగర్, ప్రగతినగర్ రోడ్డుపై మంజీర పైపులైను లీకేజీ మరమ్మతులును ఆయన మంగళవారం పరిశీలించారు. ఆయనతో పాటు ట్రాఫిక్ సీఐ వెంకట్, జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్